సాక్షి ప్రకాశం

గురువారం । 29 । ఆగస్టు । 2024



చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా..
వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. - 8లో..



20 కేజీల గంజాయి స్వాధీనం
గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు 20 కేజీల గంజాయిని ఒంగోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.4/28
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.



హెల్త్‌సెంటర్లలో భద్రత పెంచాలి
ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు ఎమర్జెన్సీ సేవలు అందించేందుకు రాత్రి సమయాల్లో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీ, మహిళా సిబ్బంది పనిచేస్తుంటారు. ఇలాంటి వారికోసం వైద్యశాలల్లో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో పోలీసులు వైద్యశాల ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహించాలి. కోల్‌కత్తా వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.
– డాక్టర్ హరీష్, మెడికల్ ఆఫీసర్, తర్లుపాడు పీహెచ్‌సీ



వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి
వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్యుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, అత్యాచారాలకు పాల్పడటం సరైన పద్ధతి కాదు. చట్టంలో కఠిన శిక్షలు ఉంటేనే వైద్యులకు రక్షణ లభిస్తుంది. ప్రజలకు వైద్యం అందించడం మా బాధ్యత. మా రక్షణ ప్రభుత్వ బాధ్యతగా భావించాలి. నిరంతరం ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు అందించే వైద్యులకు ప్రతి ఒక్కరూ రక్షణగా నిలబడాలి. కోల్‌కత్తాలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.
– సూరిబాబు, సూపరింటెండెంట్, గిద్దలూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాల

న్యూస్‌రీల్

కమిషనర్‌గా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కే.వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలుకు బదిలీపై వచ్చారు. తొలిరోజు ఒంగోలు నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం, పారిశుధ్య విభాగం, సచివాలయ విభాగాల సిబ్బంది, అధికారులతో సమీక్షలు నిర్వహించారు. కమిషనర్ కూడూరు వెంకటేశ్వరరావు స్వగ్రామం కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం రామకృష్ణాపురం గ్రామం. 2018 బ్యాచ్ గ్రూప్–1 కేటగిరీలో ఎంపికయ్యారు. మొదట నెల్లూరు నగర పాలక సంస్థలో అడిషనల్ కమిషనర్‌గా 2018లో మొదటి పోస్టింగ్‌లో చేరారు. అనంతరం కావలి మున్సిపల్ కమిషనర్‌గా 2019–20 మధ్య కాలంలో పనిచేశారు. తరువాత నరసరావుపేట కమిషనర్‌గా కొంతకాలం పాటు పనిచేశారు. అనంతరం 2020– 2023 వరకు హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. అక్కడ నుంచి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఒంగోలు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యంగా విశాఖపట్నంలో గురువారం ఆల్ ఇండియా లెవల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ల సదస్సుకు వెళ్లనున్నారు.

తుమ్మలచెరువులో ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ టీమ్ పర్యటన



రుణాలు పొందిన వారితో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఎల్‌ఎం టీమ్

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువులో ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ టీమ్ సభ్యులు బుధవారం పర్యటించారు. చిరు వ్యాపారాలు చేసుకునే మహిళా సంఘ సభ్యులకు ఎస్‌వీఈపీ ద్వారా మంజూరు చేసిన రుణాలు వారి వ్యాపారాల అభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా పొదుపు సంఘ గ్రూపు సభ్యులకు అందిన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా ఉపయోగించుకున్నందుకు టీమ్ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొనకనమిట్ల ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, తర్లుపాడు ఏపీఎం పిచ్చయ్య, క్లస్టర్ కోఆర్డినేటర్ కే నాగభూషణం, ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ బృందం సభ్యులు, వీఓఏలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు, రేపు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర స్థాయి సమావేశాలు

ఒంగోలు సెంట్రల్: ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలు గురు, శుక్ర వారాలు రెండు రోజుల పాటు ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ వెంకటేశ్వర్లు తెలిపారు. సభలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 200 మంది పైగా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు విజయ రాఘవన్, వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరవుతాయని తెలిపారు. సంఘ చరిత్రను విస్తృత స్థాయి సమావేశాలలో చర్చించే అంశాల అజెండాను వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో 24 ఏళ్ల తర్వాత రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతున్నాయన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు వేలం ధరలు బుధవారం గరిష్టంగా కేజీ రూ.358 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 10,651 బేళ్లు రాగా 9,076 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 1575 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 142వ రోజు వేలం పాటలో 5,540 బేళ్లు రాగా, 4,783 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 757 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్టంగా రూ.195 సరాసరి రూ.303.78 వచ్చింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 136వ రోజు వేలం పాటలో 5,111 బేళ్లు రాగా 4293 బేళ్లు కొనుగోలయ్యాయి. 818 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.194, సరాసరి రూ.292.29 పలికింది.

పౌష్టికాహారం బలహీనం..!

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అరకొరగా అందుతోంది. పేదల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం ఎసరుపెడుతోంది. కందిపప్పు పంపిణీకి బ్రేక్ పడగా, ఇతర సరుకులు సైతం సకాలంలో అందడంలేదు. మరో వైపు రేషన్ డీలర్లు సైతం చేతివాటం చూపిస్తుండడంతో పౌష్టికాహారం అందని ద్రాక్షగా మారుతోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టగా కూటమి ప్రభుత్వంలో సేవలు మృగ్యమవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రం

- అంగన్‌వాడీల్లో ఆకలి కేకలు
- ఆగస్టులో కందిపప్పునకు కత్తెర
- సక్రమంగా అందని సరుకులు
- చేతివాటం చూపిస్తున్న రేషన్ డీలర్లు
- అంగన్‌వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం రిక్తహస్తం

కనిగిరి రూరల్:

మాతా శిశు మరణాల నియంత్రణ.. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కీలకంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆకలి కేకలు పెడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి అనేక చర్యలు చేపట్టింది. నిరుపేద గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి వారికి భరోసా కల్పించారు. అలాగే పిల్లలకు అత్యుత్తమ విద్య అందించేలా పటిష్ట చర్యలు తీసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై చిన్న చూపు చూస్తోంది. అక్కడ అమలు చేయాల్సిన పథకాలు, అందించాల్సిన పౌష్టికాహార, పోషకాల వస్తువులపై దృష్టి పెట్టకుండా గాలికి వదిలేసింది.

కందిపప్పు కోత:
అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు నెలాఖరులో లేదా, నెల మొదటి వారంలో సరఫరా చేస్తారు. అయితే ఆగస్టు నెలకు సంబంధించిన కంది సరఫరా కాలేదు. బాలింతలు, గర్భిణులకు ఇంటికిచ్చే సరుకుల్లో కూడా కందిపప్పు పూర్తిగా కోత పడింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు, కార్యకర్తలు ఏమీ చేయలేక ఉన్న సరుకులనే సరిపెట్టుకుని మౌనం దాల్చుతున్నారు. అయితే తాజాగా సెప్టెంబర్ నెలకు సంబంధించిన కందిపప్పు కూడా ఇప్పటి వరకు కేంద్రాలకు చేరలేదు. దీనిపై ఆశాఖ క్షేత్ర స్థాయి అధికారులకే పూర్తి సమాచారం లేదు.

ప్రచార ఆర్భాటానికే పరిమితమా.. !
పౌష్టికాహార, తల్లిపాల వారోత్సవాల పేరిట ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, క్లస్టర్ల పరిధిలో ప్రచార కార్యక్రమాలు ఆర్భాటంగా నిర్వహించారు. అయితే పౌష్టికారం అందించడంలో ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు సరుకులను అందించడంలో రిక్తహస్తం చూపిస్తుందనే విమర్శలున్నాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రుల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కందిపప్పు ఆలస్యంగా ఇస్తాం
ఆగస్టు నెలకు సంబంధించి కందిపప్పు సరఫరా కాలేదు. సెప్టెంబర్ నెలకు సంబంధించి ప్రొక్యూర్‌మెంట్ స్థానికంగా చేయాలనేది ప్రభుత్వ నిర్ణయం. త్వరలో టెండర్లు పిలుస్తున్నాం. కందిపప్పు సరఫరాకు కొంత ఆలస్యం కావచ్చు. డీసీపీ (డిస్టిక్ పర్చస్ కమిటీ) నిర్ణయం మేరకు జిల్లా స్థాయిలోనా..లేక ప్రాజెక్టు స్థాయిలోనా అనేది నిర్ణయం తీసుకుని టెండర్లు పిలుస్తారు. ఆన్‌లైన్‌లో అంగన్‌వాడీ వర్కర్లు చూపిన నివేదికల ప్రకారమే కేంద్రాలకు సరుకులు సరఫరా చేస్తారు. కేంద్రాల్లో చూపించిన బ్యాలెన్స్‌ను తగ్గించి.. నెలవారీ ఇండెంట్ కేటాయిస్తారు. కేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కర్‌లు కచ్చితంగా ఆన్‌లైన్ నివేదికలు ఇచ్చినా...రేషన్ డీలర్లు సరుకులు తక్కువ చేసి ఇస్తే.. ఆ డీలర్లపై ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.
– మాధురి, ఐసీడీఎస్ పీడీ, ఒంగోలు



అంగన్‌వాడీ కేంద్రాల్లోని వారోత్సవాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు

జిల్లాలో అంగన్‌వాడీ ప్రాజెక్టులు:	13
అంగన్‌వాడీ కేంద్రాలు:	2,903
ప్రీస్కూల్ పిల్లలు:	46,392
6 నెల నుంచి3 ఏళ్ల లోపు పిల్లలు	58,388

రేషన్ డీలర్ల చేతివాటం ?
అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు ప్రతి నెలా ఒక్కొక్కరికి మూడు కిలోల బియ్యం, ఒక కిలో కంది పప్పు, అరకిలో నూనె, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగి పిండి, అరకిలో పప్పు చెక్క, అరకిలో బెల్లం, ఒక కిలో అటుకులు (అన్నీ ఒక కిట్టుగా) పంపిణీ చేస్తారు. ప్రతి కేంద్రంలో నమోదైన సంఖ్య ఆధారంగా నెలాఖరులో లేదా మొదటివారంలో కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సరుకులు సకాలంలో అందడం లేదన్న ఆరోపణలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే సరుకుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతారు. అందులో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే సరుకులతో పాటు చిన్నారుల సంఖ్యను బట్టి ఓపెనింగ్ బ్యాలెన్స్ నివేదికను ఉంచుతారు. ఈ నివేదిక ఆధారంగా రేషన్ డీలర్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ఆ సరుకుల పంపిణీలో రేషన్ డీలర్లు చేతి వాటం చూపిస్తున్నారనే విమర్శలున్నాయి. కుంటి సాకులు చెబుతూ సరుకులు ఎగ్గొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పలు ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, డీలర్లకు వాదనలు జరిగిన సంఘటనలు ఉన్నాయని తెలుస్తోంది.

యువతకు ఉపాధి చూపాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: యువతకు అవసరమైన నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి చూపాలని ఆ మేరకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బుధవారం ప్రకాశం భవనంలో ఈ నెల 31వ తేదీ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జ్యోతి క్వార్ట్‌జ్ సర్ఫేసెస్ ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇదే విధంగా మరికొన్ని కంపెనీలతో చర్చించి యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ నెల31వ తేదీ నిర్వహించే కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ తెలిపారు. 19 నుంచి 27 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రికల్, డిప్లొమా మెకానికల్ పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. దీనిలో డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐదు పాఠశాలలకు ధ్యాన్‌చంద్ ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు: జిల్లాలోని ఐదు పాఠశాలలకు మేజర్ ధ్యాన్ చంద్ ప్రతిభా పురస్కారాలను (జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు) గురువారం అందజేయనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఐదు పాఠశాలలను ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. డీఈవో డి.సుభద్ర అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ఒంగోలు డిప్యూటీ డీఈవో సామా సుబ్బారావు, హెచ్‌ఎంలు పి.సుధాకర్, బి.శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఉన్నారు. గత ఏడాది స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు ఈ అవార్డును అందజేస్తారు. అందులో సంతనూతలపాడు మండలం మైనంపాడు హైస్కూల్, దొనకొండ జెడ్పీ హైస్కూల్, జరుగుమల్లి జెడ్పీ హైస్కూల్ , కనిగిరి మండలం గురవాజీపేట జెడ్పీ హైస్కూల్, సింగరాయకొండ జెడ్పీ హైస్కూల్ ఎంపిక చేశారు. ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పురస్కారాలను గురువారం మైనంపాడు డైట్ కాలేజీలో అందిస్తారు.

'బంగారు బాల్యం' కార్యక్రమం నేడు

- హాజరుకానున్న నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి

ఒంగోలు సెంట్రల్: జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఒంగోలు రిమ్స్‌లో గురువారం నిర్వహించనున్న 'బంగారు బాల్యం' కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా బుధవారం పరిశీలించారు. కార్యక్రమానికి నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, ఆర్‌డీఓ సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ పీడీ మాధురి, చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రం ఉప సంచాలకుడు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోల సెంట్రల్: కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు, మహిళలపై జరుగుతున్న ఘోరాలకు నిరసనగా బుధవారం ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బాలికలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం.. కాపాడుకుందాం.. మహిళల హక్కులను కాపాడుదాం అంటూ ప్ల కార్డులు పట్టి నినాదాలతో కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించి ముంగమూరు జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. కళాశాల డైరెక్టర్ వై సత్యనారాయణ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రాజేంద్ర బాబు, టీ రాజశేఖర్ రెడ్డి, షేక్ నిరోషా, ఎం పద్మ సిబ్బంది పాల్గొన్నారు.

ఓడిపోతేనేం.. తగ్గేదేలా..!

- ఓడిపోయినా తానే జెడ్పీటీసీనంటూ ఫ్లెక్సీలు
- త్రిపురాంతకం టీడీపీ నాయకుడి నిర్వాకం



యర్రగొండపాలెం: ఎన్నికల్లో ఓడిపోతేనేమి.. దేనికైతే పోటీ చేశామో ఆ పదవిని పేరు కింద తగిలించుకుని పెత్తనం చేస్తే పోలా అనుకున్నాడా టీడీపీ నాయకుడు. త్రిపురాంతకం జెడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన పరిమి శ్రీను తన కుమార్తె వివాహం సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా పెత్తనం చెలాయిస్తున్న గూడూరి ఎరిక్షన్ బాబుతోపాటు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తూ వేయించిన ఫ్లెక్సీలలో తన పేరు కింద ఏకంగా జెడ్పీటీసీ అని వేయించుకున్నాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో త్రిపురాంతకం మండలంలోని గణపవరానికి చెందిన శ్రీను జెడ్పీటీసీ పదవికి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులు తమకు ఎటువంటి హోదా లేకున్నా ప్రభుత్వ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఈక్రమంలోనే జెడ్పీటీసీగా పోటీ చేసి చేతులు కాల్చుకున్న శ్రీను ఆ హోదాను ఉపయోగించుకోవటానికి ఫ్లెక్సీలో తనపేరు కింద జెడ్పీటీసీ అని వేయించుకోనుంటారని పలువురు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగం

ఒంగోలు సెంట్రల్: జనరేట్ యువర్ బిజినెస్ (జీవైబీ) ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆర్థిక స్వావలంబనకు చక్కగా ఉపయోగపడుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి (డీఎస్‌డీఓ) రవితేజ అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు గవర్నమెంట్ ఐటీఐ (గరల్స్) కళాశాలలో బుధవారం ''మీ వ్యాపారాన్ని రూపొందించండి'' (జీవైబీ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ రవితేజ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆర్థిక స్వావలంబనకు దారితీసే ఒక సుస్థిరమైన వేదిక ఇది అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయటం అత్యవసరమని అన్నారు. ప్రిన్సిపాల్ ఉమాదేవి కూడా మాట్లాడారు.

వికసిత్ ఏపీ ఎట్ 2047 దిశగా అడుగులు

- మెప్మా పీడీ టి.రవి కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ టి.రవి కుమార్

ఒంగోలు సబర్బన్: వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఎట్ 2047 విజన్ ప్లాన్ తయారీ దిశగా అడుగులు వేయాలని మెప్మా పీడీ టి.రవి కుమర్ పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలోని టీటీడీసీలో బుధవారం వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఎట్ 2047 లక్ష్య సాధన దిశగా క్షేత్ర స్థాయి విజన్ ప్లాన్‌తో సిబ్బంది పనిచేయాలన్నారు. పట్టణ స్థాయి, జిల్లా స్థాయిలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక విజన్ ప్రణాళికల రూపకల్పనపై సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తారని చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలనకు కనీసం ప్రతి కుటుంబం నెలవారీ ఆదాయం రూ.25 వేలు ఉండేలా జీవనోపాధుల కల్పన, సంతృప్తి స్థాయిలో అర్హులైన మహిళలను, వీధివిక్రయదారులు, దివ్యాంగులు, ఇతర ఉత్పత్తులు ఆన్‌లైన్ అమ్మకాలు, అందుకు అవసరమైన నైపుణ్య శిక్షణలు, సైబర్ నేరాలు, బాలల హక్కులు, బాలకార్మికత్వం, బాల్య వివాహాలు, రక్తలేమి, స్త్రీల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. అందుకోసం హెల్త్ క్లబ్స్ పెంపొందించుకోవటం, సామాజిక భద్రత, జీవిత బీమా కల్పించటం, బ్యాంకులు, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందజేసి ఉపాధికల్పనే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ కల్పన, జయకుమార్, రాణి, శ్యామల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలు వాయిదా వేయాలి



ఒంగోలులోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

- రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా గతంలో జరిగిన బదిలీలను రద్దు చేయాలి
- వాణిజ్య పన్నుల కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన

ఒంగోలు సబర్బన్: వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు వాయిదా వేయాలని వాణిజ్య పన్నుల శాఖ సర్వీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ధారావారి తోటలోని వాణిజ్య పన్నుల శాఖ సీటీఓ 1, సీటీఓ 2 కార్యాలయాల సిబ్బంది మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఆ శాఖ నెల్లూరు డివిజన్ పరిధిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల అసోసియేషన్ అధ్యక్షుడు జాజుల నరశింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేస్తూ సదరు సిబ్బందిని వారి సొంత యూనిట్ ఆఫ్ అపాయింట్ స్థానాలకు బదిలీ చేసి తిరిగి సర్కిల్ వ్యవస్థకు పరిపుష్టత తీసుకురావాలని డిమాండ్ చేశారు. జీఎస్‌టీఓలకు సరైన వర్క్ ఫంక్షన్ ఏర్పాటు చేయాలని, రీజినల్ ఆఫీసులను రద్దు చేయాలని పునర్వ్యవస్థీకరణ పేరుతో జరిగిన ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలన్నారు. వికేంద్రీకరణ పేరుతో ఉన్నతాధికారులు రాజ్యాంగ నిబంధనలు తుంగలో తొక్కి వారి స్వప్రయోజనాల కోసం ఆర్డర్ టూ సర్వ్ పేరుతో వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులను బలిచేశారని ధ్వజమెత్తారు. కొందరు ఉన్నతాధికారులు పన్ను ఎగవేతదారులకు సహకరించినందున ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిపాడు (నాగులుప్పలపాడు): నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో గల ఏపీ బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో హిందీ, ఇంగ్లిష్ మీడియంలో సోషల్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.మాధవి తెలిపారు. పూర్తి వివరాలకు 87126 25043 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

గుండెపోటుతో బ్యాంకు మేనేజర్ మృతి

● పని ఒత్తిడే కారణం


శ్రీనివాసులు (ఫైల్)

మార్కాపురం: పనిఒత్తిడి తట్టుకోలేక బ్యాంకు మేనేజర్ విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మార్కాపురం పట్టణానికి చెందిన తూంపాటి శ్రీనివాసులు (56) స్థానిక పీడీసీసీ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పదిరోజుల నుంచి బ్యాంకు లావాదేవీలు, రుణాలు, ఋణాల వసూళ్లు, సహకార బ్యాంకుల్లో ఉన్న సంఘాల వివరాలను కంప్యూటరీకరణ చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తన ఛాంబర్‌లో కూర్చొని ఫైల్స్ చూస్తూ పక్కకు ఒరిగాడు. వెంటనే సిబ్బంది సపర్యలు చేసి స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఒత్తిడి వల్లే చనిపోయాడని సిబ్బంది, కుటుంబసభ్యులు, సన్నిహితులు, స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు సిబ్బంది, సహచరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మురళి

దర్శి: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలో అద్దంకి రోడ్డులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన వెన్నపూస కాశిరెడ్డి(22) అనే యువకుడు ఇంట్లోనే ఉరేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న ఎస్సై మురళి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే ప్రేమ విఫలమై మృతి చెందినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి


సానికవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న సీఎండీ రవిపాటిన్‌శెట్టి

పెద్దారవీడు: రైతులు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి పాటిన్‌శెట్టి అన్నారు. విజయవాడ నుండి శ్రీశైలం వెళ్తూ మార్గమధ్యలో మండలంలో సానికవరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ముఖ్యంగా రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఫీడర్లు ఏ రోజుకు ఆ రోజు నమోదు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా ఎలా ఉంది, హెచ్చుతగ్గులు ఏమైనా వస్తుందా, పరికరాలు నాణ్యంగా ఉన్నాయా, తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్‌ఈ సత్యనారాయణ, ఈఈ నాగేశ్వరరావు, లైన్‌మన్, షిఫ్ట్ అపరేటర్లు, వాచ్‌మన్ ఉన్నారు.



వైద్యుల భద్రతకు భరోసా ఇవ్వాలి

ప్రభుత్వ వైద్యశాలల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా కల్పించాలి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వైద్య సిబ్బందిపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్నాయి. వీటి నివారణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. ప్రధానంగా రాత్రి సమయంలో విధులు నిర్వహించే వారికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా హత్యాచారం లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహిళా వైద్య సిబ్బందికి భద్రత ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ఎస్‌డీ ఉమేరా, పొన్నలూరు పీహెచ్‌సీ డాక్టర్



దుండగులకు యావజ్జీవ శిక్ష విధించాలి

ఇటీవల కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించాలి. ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులకు రక్షణ లేకపోతే పని ఎలా చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే అధికార యంత్రాంగం గట్టిగా చర్యలు తీసుకోవాలి. మహిళల జోలికి రావాలంటే భయపడేలా చట్టాలు అమలు చేయాలి. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మహిళా డాక్టర్లకు కనీస సదుపాయాలతోపాటు భద్రత కల్పించాలి.

– డాక్టర్ ఎం.సుగుణకుమార్, ఉప్పలపాడు పీహెచ్‌సీ, పొదిలి



చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా



పుడమి జడలో పరిమళ 'పద కుసుమం'
విశాల జగత్తులో ప్రశాంత 'భావ సంద్రం'
హరివిల్లెరుగని మనోహర 'మది వర్ణం'
మధురిమ లిఖితం.. కమనీయ వాచనం
సొగసైన రాగం.. రమణీయ శ్రవణం..

ఇదీ మన తెలుగు గొప్పదనం గురించి ఓ కవి వర్ణన.. చాటువులతో చమత్కారాలు, నుడికారాలతో భావాలు, ఛందస్సుతో సమస్యాపూరణాలను తెలియపరచడం తెలుగు భాషకే సొంతం. తెలుగు భాషలోని హొయలు, కావ్యాల్లోని వర్ణనలు, అష్టావధానాలు ప్రజల మదిలో చిరస్మరణీయం. భావిభారత పౌరులకు తెలుగు అక్షర మాల ఓ దిశానిర్దేశం. అమ్మ అనే కమ్మనైన పిలుపును పరిచయం చేసిన తెలుగు భాషా నీకు వందనం. గురువారం వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జిల్లా కవులు, భాషాభివృద్ధికి పాటుపడుతున్న వారిపై ప్రత్యేక కథనం..

మార్కాపురం/కంభం:

తెలుగు ప్రజలు స్మరించదగ్గ ప్రథముడు గిడుగు రామమూర్తి. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్య భాష పనికిరాదని సాంప్రదాయిక పండితులతో ఓ యుద్ధమే చేసి వ్యావహారిక భాషకు మార్గదర్శకుడయ్యారు గిడుగు రామమూర్తి. ఆయన చేపట్టిన భాషోద్యమంతో ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు రంగరించుకుంది. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు వాడుక భాషే రాజ్యమేలుతోంది. తెలుగు భాష ప్రాచీనతను, గొప్పదనాన్ని విస్మరించకుండానే మరింత మెరుగులు దిద్ది.. వాడుక భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు. ఆయన బాటలోనే ఎందరో కవులు, రచయితలు తెలుగు భాష ఉన్నతికి నిరంతరం పాటుపడుతున్నారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

నుడికారమే భాషకు ఆయువు

'తిక్కన పద్యమొక్కటి చక్కగ చదివిన చాలు తెలుగుజాతి నుడికారము తెలిసికొన్నయటౌను' తెలుగు నుడికారం గొప్పదనాన్ని వివరిస్తూ దాశరథి పేర్కొన్న మాటలివి. నుడికారమనేది పద్యాలకు, కావ్యాలకు, గ్రంథాలకు, కవులకు, పండితులకే పరిమితం కాదు. నుడికారానికి ముడిసరుకు మనం మాట్లాడే భాషే. నుడికారమనేది పండితుల కంటే ముందు పామరుడి సొత్తు. మాటల్లోని చమత్కారం అర్థం కావాలంటే ఆ మాటలు పుట్టిన సమాజంలో పుట్టి పెరగాల్సి ఉంటుంది. భాష ఒకటే అయినప్పటికీ ప్రాంతాన్ని బట్టి, ప్రజల జీవనాన్ని బట్టి నుడికారము మారుతుంది. సముద్రానికి, చేపలు పట్టడానికి సంబంధించిన నుడికారం అక్కడి జాలరుల మాటల్లో వినబడుతుంది. ఒక్కటి మాత్రం నిజం. తెలుగు నుడికారం క్రమక్రమంగా మారుతోంది. ఆర్థిక, రాజకీయ లావాదేవీలకు ఆంగ్లము తప్పనిసరైంది. తెలుగు, సంస్కృతం కలిసిన తెలుగు మాటల స్థానాన్ని ఇప్పుడు ఆంగ్లం ఆక్రమించింది. మంచినీళ్లడిగే బదులు డ్రింకింగ్ వాటరడుగుతున్నాం మరి. 2 వేల ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగు భాష గొప్పదనాన్ని గ్రహించి, భాషను బతికించుకోవాల్సిన బాధ్యత తెలుగు గడ్డపై పుట్టిన ప్రతి పౌరుడికీ ఉంది.

పశ్చిమ ప్రకాశంలో అక్షర సేద్యం

పశ్చిమ ప్రకాశంలోని కవులు నెలనెలా వెన్నెల ద్వారా కవితా గోష్ఠులు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు చేస్తూ తెలుగు భాషాభివృద్ధికి తమవంతు కృషిచేస్తున్నారు. ఇందులో ప్రధానంగా డాక్టర్ కప్పగంతుల మధుసూధనశాస్త్రి, డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, పి.శ్రీనివాస ప్రసాద్, ఎంవీ సుబ్బారావు, తోట శ్రీనివాసరావు, డాక్టర్ పీబీవీ ప్రసాద్, గోపాలుని రమేష్‌బాబు, కొణతం రమణారెడ్డి, కాళంరాజు వేణుగోపాల్ తదితరులు తెలుగు భాషలో తమ రచనలతో అక్షర సేద్యం చేస్తున్నారు.

శాస్త్రికి కవిత్వమంటే ప్రాణం



సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్ కప్పగంతుల మధుసూధన శాస్త్రి తెలుగు సాహిత్యంపై 200కు పైగా చేసిన రచనలు, వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 130కి పైగా ఆకాశవాణిలో ఉపన్యాసాలు ప్రసారమయ్యాయి. సుమారు 50 తెలుగు సాహిత్య సభల్లో పాల్గొని ప్రసంగించారు. విద్యారంగంలో చేస్తున్న కృషికి గానూ విద్యా రత్న అవార్డు, లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2021లో ఆసియా పసిఫిక్ అవార్డు, 2019లో బెస్ట్ ప్రిన్సిపాల్‌గా అప్పటి కలెక్టర్ ద్వారా అవార్డు, ఇంకా బతుకుబండి పేరుతో స్వీయ కవితా సంపుటి, కరుణశ్రీ సాహిత్యంలో మానవత్వం, ప్రకాశం జిల్లాలో అవధాన కళపై రెండు పరిశోధనా గ్రంథాలను ఆయన రచించారు. ప్రకాశం జిల్లాలో అవధాన కళపై డాక్టరేట్ పొందారు.



పద్య కవి శ్రీనివాస ప్రసాద్

మార్కాపురం పట్టణానికి చెందిన శ్రీనివాస ప్రసాద్ పశ్చిమ ప్రకాశంలో పద్యకవిగా గుర్తింపు పొందారు. యర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న ఆయన శాసనాలను పరిశోధించి వాటి ప్రాశస్త్యాన్ని, ప్రాధాన్యతను ప్రజలకు చెప్పడంలో ముందున్నారు. తన రచనల ద్వారా సమాజంలోని మూఢ నమ్మకాలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. మహారాజు శతకం, తెలుగుబిడ్డ, త్రిపుర హరేషా, బొల్లికొండరాయ శతకం, బొల్లికొండరాయ సీస పద్యాలు రచించి పేరు గడించారు.

శతకాల రచయిత అన్నపురెడ్డి



వయోజన విద్యాశాఖలో రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా రిటైరైన డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి తెలుగు సాహిత్యంలో అక్షర సేద్యం చేస్తున్నారు. వంద రోజుల్లో తెలుగు నేర్చుకోవడం ఎలా అనే పుస్తకం ఇతర రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందింది. సుమారు 5 లక్షల మంది ఈ పుస్తకాన్ని చదివినట్లు అంచనా. 2001-02లో ఈ పుస్తకం ప్రచురితం కాగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇంకా అక్షర సరాలు, అక్షర ప్రస్థానం, అక్షరానికి రెక్కలొస్తే, అక్షర వాచకాలు, వయోజన విద్య సాహిత్యం, అక్షరాభిషేకం, అక్షర వాణి సంపుటిలను రాసి తెలుగు భాషా సాహిత్యానికి తనవంతు కృషిచేస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో గ్రామ నామాలపై లోతైన పరిశోధన చేసి పుస్తక రూపంలోకి తెస్తున్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం ఆకాశవాణిలో ధారావాహికగా ప్రసారమవుతోంది. ఇవి కాక ఆంజనేయ శతకం, జొన్నలగడ్డ జంగమేశ్వర శతకం, కపిలగిరి నరసింహ స్వామి శతకం, బొమ్మలాపురం వీరభద్ర శతకం, గిద్దలూరు పాతాల నాగేశ్వర శతకం, దేవరాజుగట్టు కాశీనాయన శతకం రచించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సాహితీ స్వచ్ఛంద సంస్థలు సత్కరించాయి. అక్షర తపస్వి, మహోపాధ్యాయ బిరుదులు అందించాయి.

వ్యాసావలిలో దిట్ట.. తోట

మార్కాపురం పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న తోట శ్రీనివాసరావు తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. రేపటి సూరీడు, పోతులూరి వీరబ్రహ్మేంద్ర శతకం, వ్యాసావలి, బొడిచర్ల ఆంజనేయస్వామి శతకాన్ని రచించారు. తెలుగు పాటలను సేకరించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించారు.



బోధనలో ఆంతర్యం.. భాషపై మమకారమే..



పోటీ ప్రపంచంలో అందరూ ఇంగ్లిష్ వైపు పరుగులు పెడుతున్నా తెలుగు భాష ఎందులోనూ తక్కువ కాదని చాటిచెప్పేలా విభిన్న పద్ధతుల్లో విద్యా బోధన చేస్తూ మన్ననలు పొందుతున్నారు టీచర్ ఆకవీటి సరోజ. కంభం మండలం హజరత్‌గూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆకవీటి సరోజ.. విద్యార్థులకు అష్టావధానాలు ఏర్పాటు చేసి పండితులుగా, కవులుగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. రామాయణ, మహాభారతాలు, పంచతంత్ర కథలు, తెలుగు పాఠ్యపుస్తకాల్లో ఉన్న కథలు, గ్రంథాలయ పుస్తకాల్లో ఉన్న నీతి కథలు చెబుతూ విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తి కల్పిస్తున్నారు. తెలుగులో వెనకబడ్డ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పాఠాల్లో అంశాలను బట్టి పంట పొలాలు, ప్రాచీన ప్రదేశాలకు తీసుకెళ్లి అక్కడే బోధిస్తూ విద్యార్థులకు తెలుగుపై మమకారం పెరిగేలా చేస్తున్నారు. తెలుగు పద్యాలు, కవితలు, పాటలు నేర్పిస్తూ, పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. 'అమ్మలాంటి తెలుగు భాష ఎంతో గొప్పది. ఇంగ్లిష్ అవసరమే కానీ తెలుగును ఎవరూ తక్కువ చేసి చూడరాదు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి తెలుగుపై మమకారాన్ని పెంచుకోవాలి' అని చెబుతున్నారు సరోజ.

20 కేజీల గంజాయి, చోరీ సొత్తు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

ఒంగోలు సెంట్రల్: జల్సాలు, బెట్టింగ్‌లు, ఈజీ మనీకి అలవాటు పడిన యువకులు పలు నేరాలకు పాల్పడటంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించేందుకు గంజాయి అమ్ముతూ ఒంగోలు పోలీసులకు బుధవారం పట్టుబడ్డారు. ఒంగోలు ఒకటో పట్టణ సీఐ నాగరాజు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలో గంజాయిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ నాగరాజు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో తాళ్లూరు మండలం శివరామపురం గ్రామానికి చెందిన రావిపాటి జగదీష్, పొదిలి ఓబులుశెట్టి వారి వీధికి చెందిన పొదిలి నరసింహారావు, కుందూరు గ్రామానికి చెందిన గోరంట్ల ఏడుకొండలు, బాపట్ల టౌన్ దేవుడు మాన్యానికి చెందిన మేడికొండ రంగా జల్సాలు, బెట్టింగ్‌లకు పాల్పడుతూ చెడు వ్యసనాలకు లోనై పలు దొంగతనాలు, మోసాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పలు కేసుల్లో జైలు జీవితం కూడా అనుభవించారు. అయితే దొంగతనం కన్నా గంజాయి అమ్మితే త్వరగా ఎక్కువ మొత్తంలో సంపాదించవచ్చని తెలుసుకున్న వీరు విజయవాడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి తీసుకొచ్చి ఒంగోలు కొండపై ప్యాకెట్స్ చేసుకునేందుకు వచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ నాగరాజు సిబ్బంది, తహసీల్దార్ వాసుతో కలిసి వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 20 కేజీల గంజాయి, రూ.1.80 లక్షల విలువైన 55 గ్రాముల బంగారు గొలుసు, మొత్తం రూ.2.80 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తక్షణమే స్పందించి నిందితులను అరెస్టు చేసిన వారిలో ఒంగోలు టౌన్ సీఐ వై నాగరాజు, ఎస్సైలు కిషోర బాబు, కే సురేష్, ఏఎస్సై సాయి, హెచ్‌సీ విజయ్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థికి అస్వస్థత

పుల్లలచెరువు: కేజీబీవీలో చదువుతున్న విద్యార్థి అస్వస్థతకు గురికావడంతో యర్రగొండపాలెం వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కోటమ్మతో పాటు చదువుతున్న విద్యార్థులు చిన్న విషయంలో గొడవపడ్డారు. దీంతో మనస్తాపంతో కోటమ్మ తన దగ్గర ఉన్న మాత్రలు మింగింది. గమనించిన తోటి విద్యార్థులు విషయం ఉపాధ్యాయులకు తెలియజేయడంతో వారు వెంటనే యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యపరీక్షలు చేయించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి బాగుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మారుమూల బడి.. ఆటలో మేటి

● గురువాజీపేటకు 'క్రీడా కిరీటం'
● వరుసగా రెండోసారి జిల్లా క్రీడా ప్రతిభా అవార్డు
● నేడు అవార్డు అందుకోనున్న పాఠశాల పీడీ


రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

కనిగిరి రూరల్: అదో మారుమూల బడి అయినా క్రీడా ప్రతిభలో మేటి... ఈ పాఠశాలలో పీడీ (వ్యాయాప ఉపాధ్యాయుడి) పట్టుదల, తోటి ఉపాధ్యాయుల, గ్రామ పెద్దల సహకారంతో గడిచిన 13 ఏళ్లలో సుమారు 300 మంది విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు. వారిలో కొందరు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచి పాఠశాల ప్రతిభను చాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో గురువాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల జిల్లాలో ఉత్తమ క్రీడా అవార్డును పాఠశాల కైవసం చేసుకుంది. వరుసగా రెండు సార్లు ఈ అవార్డు సాధించింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ మైనంపాడులో ప్రతిభ పురస్కారాలు అందచేయనున్నారు.

క్రీడా కెరటాలు:
గురువాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7 గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. సుమారు 190 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతికి చెందిన వారు 100 మంది వరకు నిత్యం కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, సైక్లింగ్ ఆటలు ఆడుతుంటారు. స్కూల్ గేమ్స్, అసోసియేషన్ గేమ్స్‌లు అనేక మార్లు ప్రతిభ చాటారు. ఇక ప్రభుత్వాలు నిర్వహించే.. సీఎం కప్, ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో గురువాజీపేట క్రీడాకారులు అనేకసార్లు విజేతలుగా నిలిచారు. గడిచిన 13 ఏళ్లలో సుమారు 300 మంది క్రీడాకారులు వివిధ రకాల క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో మేటి:
ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాల్‌బ్యాడ్మింటన్‌లో ఎక్కువగా ప్రతిభ చాటారు. ఈ స్కూల్‌కు చెందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లోని టీంకు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల (ఆదివారం) జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు నుంచి బాలికల, బాలుర విభాగాల్లో మొత్తం 20 మందికి గాను 11 మంది గురువాజీపేట పాఠశాలకు చెందిన విద్యార్థులున్నారు. బాలికల జట్టులో 10 మందిలో ఆరుగురు, బాలుర జట్టులో 10 మందికి గాను ఐదుగురు ఉన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సెప్టెంబర్ 12,13,14 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే స్టేట్ మీట్‌లో ఆడనున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థుల ప్రతిభతో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో జిల్లా ఉత్తమ క్రీడా అవార్డును పాఠశాల కైవసం చేసుకుంది.

5 సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడా



నేను పదో తరగతి చదువుతున్నాను. ఇప్పటికి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 5 సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడాను. అండర్ 17 విభాగంలో జిల్లా స్థాయి టీంకు ప్రాతినిధ్యం వహించాను. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఆడనున్నా. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా ఆశయం.

– బీ అంజలి, పదో తరగతి

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఆడనున్నా



బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో అనేక సార్లు పాల్గొన్నాను. అండర్ 14 విభాగంలో జిల్లా టీంకు లీడర్‌గా వ్యవహరించాను. ఇప్పటికి రాష్ట్ర స్థాయిలో ఐదుసార్లు పోటీల్లో పాల్గొన్నా. సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనున్నా. ఎప్పటికైనా వ్యాయామ ఉపాధ్యాయురాలు కావాలన్నదే లక్ష్యం.

– ఎం జ్యోతి, పదో తరగతి

ఎంతో ఆనందంగా ఉంది



నా సర్వీసులో ఎక్కువ భాగం గురువాజీపేట పాఠశాలలోనే వ్యాయామ ఉపాధ్యాయునిగా చేశా. సుమారు 200 మంది విద్యార్థులను వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీల్లో ఆడించారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రత్యేక ప్రతిభ చూపేలా తయారు చేశాను. 2023-24 సంవత్సరంలో జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి అవార్డు పొందాను. నాకు సహకరించిన సహచర ఉపాధ్యాయులకు, గ్రామ పెద్దల, దాతల సహకారం మరవలేనిది.

– పొట్టేండ్ల బసవయ్య, పీడీ, గురువాజీపేట ఉన్నత పాఠశాల